

మహిళలపై క్యాన్సర్ పంజా..!
మహిళలపై క్యాన్సర్ భూతం పంజా విసురుస్తోంది. మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో క్యాన్సర్ కేసులు బయటపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 10లో▸



'డబుల్'యోగం ఇప్పట్లో లేనట్లే?
పేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీపై భైంసాలో సందిగ్ధం నెలకొంది. నిర్మాణం పూర్తయినా అప్పగించలేదు. 11లో▸

గరిష్టం/కనిష్టం
35.5 /22.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా ఎక్కువగా నమోదవుతాయి. ఎండవేడి ఎక్కువగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

అమాస పోయినంకనే..

- టికెట్ల ఖరారుకు పితృపక్షం ఆటంకం
- ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు..
- ప్రచారం షురూ చేసిన 'కారు' పార్టీ
- టికెట్ల కోసం బీజేపీ, కాంగ్రెస్ ఆశావహుల నిరీక్షణ
- నవరాత్రుల్లో అసలు పోరు..



నిర్మల్: ఎన్నికల షెడ్యూల్ వచ్చి మూడు రోజులైనా జిల్లాలో ప్రచారం ఊపందుకోవడం లేదు. అసలు కొంతమంది అభ్యర్థులు ప్రజల్లోకే రావడం లేదు. ఎన్నికల సందడే కనిపించడం లేదు. ఎందుకంటే..!? ఇప్పుడంతా పితృపక్షాలు నడుస్తున్నాయి. శాస్త్రం ప్రకారం ఈ మాసంలో కొత్త పనులు చేపట్టొద్దు. ఈనెల 14న అమావాస్య ఉంది. అమావాస్య పోగానే శరన్నవరాత్రులు ప్రారంభమవుతాయి. వాటితోపాటే ప్రచారపోరు షురూ చేస్తామని అభ్యర్థులంటున్నారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థుల ప్రకటన కూడా దసరా నవరాత్రుల్లోనే ఉండే అవకాశం ఉంది.

ప్రచార రథాలు సిద్ధం..
ప్రతీ అభ్యర్థి తన ప్రచార కోసం ప్రత్యేకంగా రథాన్ని(వాహనాన్ని) తయారు చేయించుకుంటారు. ఈ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు, టికెట్ గ్యారంటీగా వస్తుందన్న ఆశావహులు ప్రచార రథాన్ని సిద్ధం చేసి పెట్టుకున్నారు. బీఆర్ఎస్ ముందే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రత్యర్థులకంటే ముందే సిద్ధమయ్యారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఊరూరా చుట్టివచ్చేందుకు వాహనాన్ని సిద్ధం చేయించారు. గులాబీవర్ణంలో, సీఎం కేసీఆర్, కేటీఆర్‌తోపాటు అల్లోల ఫొటో ప్రముఖంగా కనిపించేలా తీర్చిదిద్దారు. ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ సైతం ప్రచార రథం సిద్ధం చేయించారు. ముధోల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాత్రం ఈనెల 8న బాసరలో తన ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఇక నిర్మల్ టికెట్ దాదాపు ఖరారైన బీజేపీ, కాంగ్రెస్ ఆశావహులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శ్రీహరిరావులు సైతం తమ ప్రచార రథాలను సిద్ధంచేసుకున్నారు.

ఎన్నికల పండుగ..
మొత్తం మీద దసరా నవరాత్రుల్లోనే అసలైన ఎన్నికల పండుగ వాతావరణం కనిపించనుంది. పితృపక్షాలు పూర్తయిన తర్వాతే ప్రచార జోరు మొదలుకానుంది. దసరా పండుగ వాతావరణాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు అభ్యర్థులు, ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. వ్యక్తిగతంగా పండుగ నజరానాలు, దావత్‌లకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి దసరా మాములుగా ఉండదంటూ సోషల్ మీడియాలో ఇప్పటి నుంచే పోస్టులు పెడుతుండటం గమనార్హం.

అభ్యర్థుల ప్రకటన అప్పుడే..
స్థానిక అభ్యర్థులు, ఆశావహులే కాదు.. పార్టీలూ సెంటిమెంట్ ప్రకారం నడుస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికీ తమ అభ్యర్థులను ప్రకటించలేదు. రేపుమాపు అంటూ మొత్తం మీద ఈ అమావాస్య తర్వాతే సీట్ల కేటాయింపు ప్రకటించేలా ఉన్నాయి. జిల్లాలో బీజేపీ నుంచి నిర్మల్ నియోజకవర్గంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఒక్కరే టికెట్ ఆశిస్తుండగా, ముధోల్‌లో పడకంటి రమాదేవి, రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్, బాజీరావుపటేల్ ఆశిస్తున్నారు. ఇక ఖానాపూర్‌లో రాథోడ్ రమేశ్, జానకీబాయి, హరినాయక్ తదితరులు టికెట్ రేసులో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి నిర్మల్‌లో శ్రీహరిరావు ముందువరుసలో ఉండగా, ముధోల్‌లో డాక్టర్ కిరణ్‌కుమార్, ఆనంద్‌రావుపటేల్, విజయ్‌కుమార్‌రెడ్డి ఆశిస్తున్నారు. ఖానాపూర్‌లో భరత్‌చౌహాన్, చారులతరాథోడ్, వినోద్‌నాయక్ తదితరులు పోటీ పడుతుండగా వెడ్మ బొజ్జు పేరు ప్రధానంగా వినిపిస్తోంది.

కలెక్టర్‌పై బదిలీ వేటు!

- ఎన్నికల కమిషన్ ఆదేశాలు



వరుణ్‌రెడ్డి

నిర్మల్: జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఎన్నికల వేళ ఊహించని పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. వరుణ్‌రెడ్డిని ఎక్కడికి పంపించాలి, జిల్లాకు ఎవరిని కేటాయించాలన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. ప్యానెల్ కమిటీ ప్రకారం గురువారం సాయంత్రం 5 గంటలలోపు కొత్తవారిని కేటాయించాలని ఈసీ ఆదేశించింది. స్వల్పకాలంలో కలెక్టర్‌ను తప్పించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఎనిమిది నెలల్లోనే..
ఈ ఏడాది జనవరి 31న జిల్లా నాలుగో కలెక్టర్‌గా వరుణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఫిబ్రవరి 2న విధులు చేపట్టారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఆయన 2019 బ్యాచ్ ఐఏఎస్. కుమురం భీం ఆసిఫాబాద్ అడిషనల్ కలెక్టర్(స్థానికసంస్థలు)గా, ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా పని చేశారు. జిల్లాకు వచ్చిన ఎనిమిది నెలల్లోనే అనూహ్యంగా ఎన్నికల సంఘం బదిలీ చేసింది.

జిల్లాపై తనదైన ముద్ర..
8 నెలల తొమ్మిదిరోజులపాటు కలెక్టర్‌గా కొనసాగిన వరుణ్‌రెడ్డి జిల్లాలో తనదైన ముద్ర వేశారు. వర్షాలు, వరదల సమయంలో సకాలంలో స్పందించారు. జిల్లా మహిళల్లో రక్తహీనత నివారణకు 'అనిమియాసే నిర్మల్ ముక్త్' కార్యక్రమ చేపట్టారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధిహామీల్లో పలు అవార్డులు జిల్లాకు దక్కేలా చేశారు. పానికి వనం ప్రారంభం, చారిత్రక కట్టడాల పరిరక్షణ, అభివృద్ధి పనుల్లో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. 2019 బ్యాచ్‌కు చెందిన జూనియర్ కావడంతోనే ఎన్నికల వేళ వరుణ్‌రెడ్డిని బదిలీ చేసినట్లు సమాచారం. మరోవైపు జిల్లాలో బోగస్ ఓట్లపై బీజేపీ ఈసీకి ఫిర్యాదు చేయడం, జూనియర్‌గా ఉన్న వరుణ్‌రెడ్డిని మంత్రి జిల్లాకు తీసుకువచ్చారన్న ఆరోపణలు ఉండటం కూడా బదిలీ వేటుకు కారణమని చర్చ జరుగుతోంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్



ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి అజేశ్‌కుమార్

నిర్మల్‌టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సేఫ్ చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ అనే ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం అజేశ్‌కుమార్ మాట్లాడుతూ... రాజ్యాంగంలోని న్యాయపరమైన చట్టాలను వివరించారు. ప్రతిఒక్కరికీ సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహ హింస చట్టం, ట్రైబల్ రైట్స్ సంబంధించిన న్యాయ సేవలపై అవగాహన ఉండాలన్నారు. బాలికలు చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. నిర్మల్ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రాజలింగం, న్యాయవాది లింగగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా ఆఫర్

భైంసాటౌన్: దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ అందిస్తున్న ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భైంసా డిపో మేనేజర్ అమృత కోరారు. ఈనెల 21, 22, 23 అలాగే 28, 29, 30 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిని లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. రీజియన్ పరిధిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.9,900 చొప్పున బహుమతులు అందిస్తామన్నారు. ఇందుకు ప్రయాణికులు టిక్కెట్ వెనుక పేరు, చిరునామా, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్‌బాక్స్‌లో వేయాలని సూచించారు.

కానిస్టేబుల్‌కు ఏఎస్పీ ప్రశంస



గంగాధర్‌ను అభినందిస్తున్న ఏఎస్పీ, సీఐ

భైంసాటౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గంగాధర్‌ను ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, సీఐ ఎల్.శ్రీను అభినందించారు. ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన కేసులో నిందితుడి గుర్తింపులో గంగాధర్ కీలకంగా వ్యవహరించాడు. ఈ సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో రివార్డుతో సత్కరించి అభినందించారు.

విష జ్వరాలను ఆరోగ్యశ్రీలో చేర్చాలి



వినతిపత్రం ఇస్తున్న పీవోడబ్ల్యూ నాయికులు

నిర్మల్‌చైన్‌గేట్: డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలను ఆరోగ్యశ్రీలో చేర్చాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయకార్యదర్శి కట్ల లక్ష్మి కోరారు. జిల్లాలో ప్రబలుతున్న విష జ్వరాలపై తక్షణమే వైద్య బృందాలు శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రగతిశీల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రజలకు సరిపడా వైద్యసిబ్బందిని నియమించాలన్నారు. విషజ్వరాలు జ్వరాల బారిన పడిన ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మల్లవ్వ, స్వప్న, సుశీల, భాగ్య భాగ్య, తస్లీన్, రేష్మ, కల్పన, లక్ష్మి ఉన్నారు.

గోదావరి తీరం.. ప్రమాద భరితం

అక్టోబర్ 1న నిజామాబాద్‌లోని పాములబస్తీకి చెందిన సంతోష్(18) స్నేహితులతో కలిసి బాసరకు వచ్చాడు. గోదావరి నదిలో స్నానాల కోసం దిగి మృతిచెందాడు.

అక్టోబర్ 6న నిజామాబాద్‌లోని గాజులపేట్‌కు చెందిన దుబ్బాక ఒడ్డయ్య(35) కూతురు పుట్టు వెంట్రుకలు తీసేందుకు బాసరకు వచ్చాడు. ఆనవాయితీ ప్రకారం గోదావరి నదిలో తెప్పను వదిలేందుకు దిగాడు. నీటిలోనే మునిగి మృతిచెందాడు.

ఈనెల మొదటి వారంలోనే ఇద్దరు భక్తులు నదిలో మునిగి చనిపోయారు. గోదావరి నది వద్ద తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం లేదు.



బాసర వద్ద గోదావరి నదిలో స్నానాలుచేస్తున్న భక్తులు

- నిర్లక్ష్యానికి భక్తుల ప్రాణాలు బలి
- ఆందోళనలు చేసినా స్పందించని అధికారులు
- ఉత్సవాల సందర్భంగా అయినా దృష్టిసారించాలి

భైంసా: మరో మూడు రోజుల్లో బాసరలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరానున్నారు. బాసరకు వచ్చే భక్తులంతా సమీపంలోని గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తారు. అయితే గోదావరి తీరం.. ప్రమాదభరితంగా మారింది. భక్తుల ప్రాణాలకు రక్షణ లేకుండాపోతుంది. ఈయేడు భారీ వర్షాలతో గోదావరి ప్రస్తుతం నిండుగా ప్రవహిస్తోంది. వరదలకు కొట్టుకువచ్చిన నల్లమట్టి స్నాన ఘట్టాలపై పేరుకుపోయింది. దీంతో స్నానాలు చేసే భక్తులు జారి నదిలో దుతున్నారు. ఒకపక్క గోదావరిలో ఆత్మహత్యలు చేసుకుంటుంటే మరోపక్క అధికారుల నిర్లక్ష్యంతో పుణ్యస్నానాలకు వెళ్లిన భక్తులు మృత్యువాతపడుతున్నారు.

15 నుంచి ఉత్సవాలు...
ఈనెల 15 నుంచి 23 వరకు బాసరలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగనున్నాయి. దసరా సెలవుల నేపథ్యంలో భారీగా భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాల నేపథ్యంలోనైనా స్నానఘట్టాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. స్నానఘట్టాల నిర్మాణ సమయంలో లోపాల కారణంగా కాలుజారితే లోపలికి వెళ్లిపోయే పరిస్థితి ఉంది. బాసర గోదావరి నదిలో ప్రస్తుతం ఐదు అడుగుల లోతు నీటి వద్ద కంచెలాంటిది ఏర్పాటు చేయాలి. ప్రమాదవశాత్తు స్నానాలు చేసే సమయంలో భక్తులు జారిపడ్డా ఐదు అడుగుల కంచె వద్దే ఆగిపోయే అవకాశం ఉంటుంది. ఈ విషయం ఆలయ అధికారులకు తెలిసినా చర్యలు చేపట్టడంలేదు.

యువకులు ఆందోళన చేసినా..
బాసర యువకులు గతంలో ఆందోళన చేసినా స్నానఘట్టాల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. గోదావరి తీర ప్రాంతంలో స్నానఘట్టాల వద్దే ఈప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నీళ్లు చూస్తే ప్రతి ఒక్కరికీ అందులోదిగి స్నానం చేయాలన్న ఆతృత ఉంటుంది. ఇక స్నేహితులతో కలిసి వచ్చేవారు నది నీటిలో గంటలతరబడి స్నానాలు చేస్తుంటారు. కొత్తగా వచ్చే ఈ యువకులు ఆనందంలో నీటి లోతును అంచనా వేయలేక లోపలికి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. బాసర ఆలయ అధికారులకు యువకులు గతంలో వినతిపత్రాలు ఇచ్చారు. జరుగుతున్న సంఘటనలపై బాసర పోలీసులు సైతం ఫిర్యాదు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలోనైనా భక్తులకు ఇబ్బంది కలుగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని యువకులు కోరుతున్నారు.

గతంలో జరిగిన ప్రమాదాలు కొన్ని..

- 2022, ఏప్రిల్ 4న హైదరాబాద్ బంజారాహిల్స్ సరస్వతి హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల సందర్భంగా బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. గోదావరి నదిలో స్నానాలకు వెళ్లిన విద్యార్థుల్లో విశాల్(15) అనే విద్యార్థి నీటిలో మునిగి మృతిచెందాడు.
- 2022, మే14న మహారాష్ట్రలోని అకోల పట్టణానికి చెందిన 17 మంది విద్యార్థుల బృందం అమ్మవారి దర్శనానికి వచ్చింది. నదిలో స్నానం చేస్తుండగా కిరణ్(22) నీటిలో మునిగి అందులోనే ఉండిపోయాడు. గమనించిన మరో విద్యార్థి ప్రదీప్(22) రక్షించబోయి మృతిచెందాడు.
- జూలై 14న ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా కందుకూరు మండలం పొన్నులూరు గ్రామానికి చెందిన విద్యార్థి మణికంఠ(14) పుణ్యస్నానానికి వెళ్లి మృత్యువాతపడ్డాడు.
- ఈయేడు మహాశివరాత్రి పర్వదినాల్లో మహారాష్ట్రకు చెందిన ప్రదీప్(25) అనే యువకుడు పుణ్యస్నానానికి వెళ్లి మృత్యువాతపడ్డాడు.

రక్షణ చర్యలు తీసుకుంటాం

బాసర అమ్మవారి క్షేత్రంలో ఈనెల 15 నుంచి 23 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. ఇప్పటికే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. సిబ్బందికి పలు సూచనలు చేశాం. రెండు రోజుల క్రితమే పోలీసు అధికారులతో కలిసి బందోబస్తు చర్యలపై సమీక్షించాం. గోదావరి నది వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం. భక్తులు లోతుకు వెళ్లకుండా ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేయించే ఏర్పాట్లు చేస్తాం.

– విజయరామారావు, ఆలయ ఈవో

లాస్ట్ చాన్స్

- యువతా.. ఓటు నమోదు చేసుకో
- అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా అర్హులే
- ఈనెల 31 వరకు నమోదుకు అవకాశం



భైంసాటౌన్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. కొద్దిరోజుల్లో ఊరూవాడ అభ్యర్థుల ప్రచారం హోరెత్తనుంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది. ఐదేళ్లకోసారి ఎన్నికల్లో నచ్చిన నేతను ఎన్నుకోవాలంటే ఓటరుగా నమోదు చేసుకోవడం ముఖ్యం. 18 ఏళ్లు నిండిన ప్రతీ పౌరుడికి భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఇప్పటికీ నమోదు చేసుకోనివారి కోసం ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈసారి నమోదు చేసుకోకుంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటువేసే చాన్స్ కోల్పోతారు. మళ్లీ ఐదేళ్ల వరకు ఎమ్మెల్యేను ఎన్నుకునే అవకాశం ఉండదు. అక్టోబర్ 1, 2023 నాటికి 18ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. వచ్చే ఎన్నికల్లో తమ విలువైన ఓటుతో ఎలాంటి నేత కావాలో ఎన్నుకునే ఆయుధాన్ని పొంద వచ్చు. ఈ తరుణంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా పేరు నమోదు చేయించుకోవడంతోపాటు ఓటు వేయడం చాలా అవసరమని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో చూసుకోవడం కీలకం. తీరా పోలింగ్ రోజు జాబితాలో పేరు లేక ఓటింగ్‌కు దూరమవుతున్న వారు లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఓటరు జాబితాలో తమ పేరుందో లేదో చూసుకోవాల్సిన అవసరం ఉంది.

యువతకు అవకాశం..
తొలిసారి ఓటరుగా నమోదు చేసుకునే యువత కీలకంగా మారనున్నారు. 18 ఏళ్లు దాటిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. చాలామంది ఓటు హక్కు నమోదులో నిర్లక్ష్యం వహిస్తూ.. తీరా ఓటు వేసే సమయానికి ఓటు లేదని బాధపడుతుంటారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం అనే సంగతి గుర్తుంచుకోవాలి. మీ ఊరు, బస్తీలో ఏ సమస్య పరిష్కారం కావాలన్నా ఓటు వినియోగమే కీలకం. ఓట్ల కోసం వచ్చే నేతలను ఆ హక్కుతో నిలదీసే అవకాశం అందరికీ రాజ్యాంగం కల్పించింది. ఇప్పటికే ఓటరుగా నమోదైనవారంతా జాబితాలో పేరు లేకపోతే ఈ నెల 31లోపు ఓటు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్‌లోనే నమోదు...
18 ఏళ్లు నిండినవారు కొత్తగా ఓటరు నమోదు కోసం ఈనెల 31 వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం ఎక్కడికి వెళ్లకుండా ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ www.ceotelangana.nic.in, కేంద్రం ఎన్నికల సంఘం వెబ్‌సైట్ https://www.nvsp.in, https:// voters.eci.gov.in పేర్లను సరి చూసుకోవచ్చు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. సందేహాలుంటే 1950 నంబరుకు ఫోన్ చేసి సూచనలు తీసుకోవచ్చు. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదుకు ఫారం 6ను నింపాలి. లేదా స్థానిక బీఎల్‌వోలను ఎన్నికల అధికారులను నేరుగా సంప్రదించవచ్చు.


నియోజకవర్గాలవారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఇతరులు	మొత్తం
ఖానాపూర్	1,06,985	1,26,102	13	2,17,665
నిర్మల్	1,17,563	1,29,914	18	2,47,495
ముధోల్	1,19,910	1,26,102	18	2,46,030



పదోన్నతులతో కూడిన బదిలీలకు కృషి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీలు జరిగేలా కృషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోర్టు కేసుల కారణంగా ఆగిపోయిన పదోన్నతులను మళ్లీ పునరుద్ధరించేలా చూస్తానన్నారు. దసరా సెలవుల తర్వాత కోర్టు కేసుల తీర్పుతో ప్రభుత్వం బదిలీలు పదోన్నతులు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు దసరా సెలవుల చివరి రోజున రిలీవింగ్ ఉత్తర్వులు ఇచ్చేలా చూస్తామని చెప్పారు. జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు దశలవారీగా పంపించే బాధ్యత సంఘం తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఐఆర్ ఐదు శాతం నుంచి 15% పెంచేలా ఒత్తిడి చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బీవీ.రమణారావు, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల బాధ్యులు, రాష్ట్ర బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

- ఎన్నికల అధికారి వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీకృత కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఎన్నికల నిబంధనలు, నియమావళిపై అవగాహన కల్పించారు. నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలియజేయాలని, ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి ప్రచార అంశాలు ఉండొద్దని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా అనుమతి తీసుకోవాలని తెలిపారు. 1950 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీ విజిల్ యాప్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ఫిర్యాదులు, అనుమతులు, నామినేషన్ ప్రక్రియను సులభతరం చేసేలా సీ–విజిల్, ఈ–సువిధ యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ–సువిధ యాప్ ద్వారా సమావేశాలకు అనుమతులు, నామినేషన్ కూడా వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన వారు వారి బూత్‌స్థాయి ఏజెంట్ల వివరాలను సమర్పించాలన్నారు. జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమాన్యాలు పార్టీలకు సంబంధించిన పోస్టర్ నుంచి పాంప్లెట్ వరకు ప్రింటింగ్ చేసే ప్రతీదానిపై ప్రెస్ పేరు, ఫోన్ నంబర్ ముద్రించాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్లు తదితరాలన్ని 24 గంటల్లో తొలగించాలన్నారు. వెబ్‌సైట్‌లో రాజకీ య నాయకుల ఫొటోలు తొలగించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ వాహనాలు రాజకీయ అవసరాలకు వాడొద్దని స్పష్టం చేశారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఆర్డీవోలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఖాతా తెరవాలి
ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేకంగా ఖాతా తెరవాలని, అభ్యర్థి తన ఎన్నికల వ్యయాన్ని చెక్కు ద్వారా ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసుకోవచ్చని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో వివిధ బ్యాంక్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. సాధారణ ప్రజలు తమ బ్యాంక్ ఖాతాలలో రూ.10 లక్షలకు మించి నగదు జమ చేసినా, తీసుకున్నా వివరాలను సంబంధిత శాఖ అధికారికి తెలుపాలని సూచించారు. బ్యాంక్ అధికారులు అభ్యర్థులకు కావాల్సిన సహాయాన్ని అందించాలన్నారు. బ్యాంక్‌లో నగదు ఒక ప్రదేశం నుంచి ఇంకో ప్రదేశానికి తీసుకెళ్లే సమయంలో తప్పని సరిగా ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించాలి

తానూరు: మండలంలోని ఝరి(బి) జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు డీఈవో రవీందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాఠశాలలో మ్యాథ్స్, సైన్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు పాఠాలు చెప్పడం లేదని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు సబ్జెక్టులపై పూర్తి అవగాహన కలగడం లేదన్నారు. ఖాళీ పోస్టులు భర్తీచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా చూడాలని కోరారు. స్పందించి డీఈవో ప్రస్తుతం బదిలీలు కొనసాగుతున్నాయని, సత్వరం సమస్య పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

క్లుప్తంగా

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన మట్కా నిర్వాహకుడు షేక్ అహ్మద్‌ను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఆ కాలనీలో దాడి చేయగా నిందితుడి వద్ద మూడు మట్కా చీటీలతో పాటు రూ.3020 నగదు లభించింది. టూటౌన్ ఎస్సై ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విద్యార్థిపై సీనియర్ల లైంగికదాడి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిపై అదే పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు మంగళవారం లైంగికదాడికి పాల్పడ్డారు. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలోని విద్యార్థిపై ముగ్గురు లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో ఆ విద్యార్థికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. బాధిత విద్యార్థి తండ్రి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

ప్రైవేట్ ట్రావెల్ సీజ్

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ట్రావెల్స్‌లో గూడ్స్ తీసుకొస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ టాప్‌పై గూడ్స్ తీసుకువస్తుండగా తనిఖీల్లో భాగంగా వాహనాన్ని టూటౌన్ పోలీసుస్టేషన్ ఎదుట ఆపి తనిఖీ చేశారు. దీంతో వాహనాన్ని రవాణ శాఖాధికారులకు అప్పగించారు. ఈ మేరకు రవాణా శాఖాధికారులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గిరిజన యూనివర్సిటీకి సేవాలాల్ పేరు పెట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే గిరి జన యూనివర్సిటీకి లంబాడాల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ పేరు పెట్టాలని ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మాజీ మంత్రి బంజారా సేవా సమితి జాతీయ అధ్యక్షుడు అమర్ సింగ్ తిలావత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన బీజే పీ బహిరంగ సభ విజయవంతమైందని అమిత్ షా సభకు భారీగా జనం తరలివచ్చారన్నారు. గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కేంద్రం గిరిజనుల ఆకాంక్షను గుర్తించిందన్నారు. ట్రైబల్ యూనివర్సిటీకి ఆదివాసుల ఆరా ధ్య దైవాలు సమ్మక్క సారలమ్మ పేరు పెట్టడం మో డీ గొప్పతనమని కొనియాడారు. గిరిజనుల్లో 65% ఉన్న లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ సేవలను కేంద్రం గుర్తించాలన్నారు. గిరిజన యూ నివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బాలికల జట్టు ఎంపిక

బెల్లంపల్లి: రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టును ఎంపిక చేశారు. బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు ఎంపిక క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. అండర్-19 విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన 12మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప, పీఈటీ రాధారాణి, పీడీలు సుధీప్, తిరుపతి, మమత పాల్గొన్నారు.

మహిళలపై క్యాన్సర్ పంజా..!



మహిళలపై క్యాన్సర్ భూతం పంజా విసురుస్తోంది. ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో క్యాన్సర్ కేసులు బయటపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయం, ఇంటిపనులు, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో తమవంతు పాత్ర పోషిస్తూ మహిళలు తమ ఆరోగ్య పరీక్షలు వాయిదా వేయడం సర్వసాధారణమైంది. ఈ నేపథ్యంలో ప్రతీ మహిళకు వైద్య పరీక్షలు అందాలనే ఉద్దేశంతో ఈ ఏడాది మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలు ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. వ్యాధులను గుర్తించి అవసరం మేరకు జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. క్యాన్సర్ గుర్తించిన వారిని హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఎంఎన్‌జే ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు మంచిర్యాల జిల్లాకు చెందిన ఓరల్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న పది మందిని, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు ఉన్న 35మందిని, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఉన్న 15మందిని రెఫర్ చేశారు.

– సాక్షి, మంచిర్యాలడెస్క్



మంచిర్యాలలోని పాలియేటివ్ కేర్ సెంటర్

- ఉమ్మడి జిల్లాల్లో పెరుగుతున్న కేసులు
- ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో పరీక్షలు

పెరుగుతున్న కేసుల సంఖ్య

ఇప్పటివరకు ఉమ్మడి జిల్యా వ్యాప్తంగా పలువురు మహిళలు వివిధ రకాల క్యాన్సర్ బారినపడ్డారు. ఓరల్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడ్డట్లు గుర్తించారు. ప్రభుత్వ మహిళ ఆరోగ్య భరోసా కేంద్రాల్లో బాధితుల సంఖ్య తెలుస్తుండగా.. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పరీక్షలు, చికిత్స చేయించుకునే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి.

పాలియేటివ్ కేర్ సెంటర్లలో చికిత్స

మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పాలియేటివ్ కేర్ సెంటర్లు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 2002 ఫిబ్రవరి 8న పాలియేటివ్ కేర్ సెంటర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. క్యాన్సర్‌తోపాటు నాన్ క్యాన్సర్‌కు సంబంధించిన క్రానిక్ బెడ్ రిడెన్ అంటే పూర్తిగా మంచానికే పరిమితమైన వారు, కిడ్నీ ఫెయిల్యూర్, పక్షవాతం, క్రానిక్ డయాబెటిక్, ఫిజియోథెరపీ అవసరమైన వారి కోసమని ఎనిమిది బెడ్లతో ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటివరకు క్యాన్సర్‌కు సంబంధించిన 430 మంది, నాన్ క్యాన్సర్‌కు సంబంధించి 1500మందికి చికిత్స అందించారు. అన్ని జిల్లాల్లో త్వరలో కీమో థెరపీ ప్రారంభిస్తామని, మొదటగా ప్రయోగాత్మకంగా ఎనిమిది జిల్లాల్లో ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఇటీవల ప్రకటించారు. కీమో థెరపీ అందుబాటులోకి వస్తే రోగులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది.

పౌష్టికాహారం తీసుకోవాలి



క్యాన్సర్ బారిన పడే వారిలో ఎక్కువ మంది ధూమపానం, మద్యపానం, పొగాకు సంబంధిత వాటిని వినియోగిస్తున్న వారే ఎక్కువగా ఉంటారు. సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా రోగ నిరోధక శక్తి పెంపొందే అవకాశం ఉంటుంది. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సరైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధులకు దూరమయ్యే అవకాశం ఉంది. – డాక్టర్ శ్రీనివాస్, పాలియేటివ్ కేర్ వైద్యుడు, మంచిర్యాల

జిల్లాల వారీగా పరిశీలిస్తే..

పరీక్షలు	మంచిర్యాల	నిర్మల్	ఆదిలాబాద్	కుమురంభీం
ఓరల్ క్యాన్సర్ టెస్టులు చేసింది:	6,427	13	3,333	2308
ఓరల్ క్యాన్సర్ అనుమానితులు:	29	13	1	0
రొమ్ము క్యాన్సర్ టెస్టులు చేసింది:	6,480	41	3,313	1857
కొత్తగా రొమ్ము క్యాన్సర్ గుర్తించింది:	7	41	0	5
గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ టెస్టులు:	1,733	189	1,446	484
గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నమోదు:	4	33	24	0

వేర్వేరు కారణాలతో ఐదుగురు మృతి



చంద్రబాయి(ఫైల్)

తానూరు: ప్రమాదవశాత్తు గాయపడిన వృద్ధురాలు బుధవారం మృతిచెందింది. ఎస్సై సందీప్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హెగ్డె చంద్రబాయి (68) వారంరోజులుగా చలి జ్వరంతో బాధపడుతోంది. మంగళవారం రాత్రి మంటకాగేందుకు పోయివద్ద పడుకుంది. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో కేకలు వేసింది. కుటుంబ సభ్యులు గమనించి మంటలు ఆర్పివేసి చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి కుమారుడు పాండురంగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

జ్వరంతో మహిళ మృతి



మౌనిక (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోలంకి మౌనిక(36) జ్వరంతో మృతి చెందింది. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెను మహారాష్ట్రలోని యవత్మాల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారం క్రితం నిర్మల్, బోథ్, ఆదిలాబాద్ రిమ్స్‌లో సైతం చికిత్స చేయించినప్పటికీ నయం కాకపోవడంతో మహారాష్ట్రకు తరలించినట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త గోవన్ సింగ్‌తో పాటు ముగ్గురు కుమారులున్నారు.

ఫిట్స్‌తో ఒకరి మృతి



లింగన్న మృతదేహం

లక్ష్మణచాంద: ఫిట్స్‌తో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని మల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పుట్టి లింగన్న (38) వ్యవసాయంతో పాటు చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం గ్రామానికి చెందిన తమ సంఘం సభ్యులతో కలిసి చింతల్‌చాంద సమీపంలోని గోదావరిలో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో మూర్ఛ రావడంతో గమనించిన గ్రామస్తులు వెంటనే ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం కొద్ది గంటల తరువాత లింగన్న మాములు స్థితికి రావడంతో మళ్లీ సాయంత్రం 4గంటల ప్రాంతంలో చింతల్‌చాంద గోదావరికి ద్విచక్ర వాహనంపై చేపలు పట్టడానికి బయలుదేరాడు. ద్రోణ ఉన్నత పాఠశాల సమీపంలో మూర్ఛ రావడంతో రోడ్డు పక్కనే ఉన్న వరి పొలంలో పడిపోయాడు. దీంతో ఊపిరి ఆడకపోవడంతో అక్కడే మృతి చెందాడు. భార్య పుట్టి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. లింగన్నకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

చెరువులోపడి యువకుడు..

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులోపడి భూమన్న (35) మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం భూమన్న గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లగా కాలుజారి నీటిలో పడి మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బావిలోపడి యువకుడు మృతి



రాజేశ్వర్ మృతదేహం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన సూర రాజేశ్వర్(25) వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఈ నెల 10న గ్రామ సమీపంలోని తన బాబాయి వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి, ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. బుధవారం ఉదయం మృతదేహం బయటకు తేలింది. రాజేశ్వర్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భీంరావు పేర్కొన్నారు.

వివిధ కారణాలతో నలుగురు ఆత్మహత్య

వృద్ధుడి ఆత్మహత్య



రాంజి గంగాధర్ (ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన రాంజి గంగాధర్(61) బుధవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గంగాధర్ భార్య భారతి ఎనిమిది నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మానసికంగా కృంగిపోయిన గంగాధర్ మనస్తాపానికి గురై లింబా(బి) నుంచి ఓలా వెళ్లే మార్గంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. మృతుడి సోదరుడు శివరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవ్‌రావు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

బోథ్: మండల కేంద్రానికి చెందిన సాదుల చంద్రయ్య(57) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాము వివరాల ప్రకారం.. చంద్రయ్య గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంద్రయ్యకు భార్య, కుమారుడు, కూతుర్లు ఉన్నారు. భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము పేర్కొన్నాడు.

ఉరేసుకుని యువకుడు..

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బట్టిసావర్‌గాం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం... గంధం వెంకటేష్ (34) దేవాపూర్ గ్రామానికి చెందిన శ్రీజతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం.. వెంకటేశ్ ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఇదే క్రమంలో భార్య శ్రీజ పిల్లలను తండ్రి వద్ద వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లింది. ఏడాది కిందట వెంకటేశ్ తల్లి లక్ష్మి కోడలుకు నచ్చచెప్పి ఇంటికి తీసుకొచ్చింది. అయినా వెంకటేశ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఆమె మళ్లీ పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య రావడం లేదని మనస్తాపానికి గురైన వెంకటేశ్ మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ట్రైన్ కిందపడి..

మందమర్రిరూరల్: మందమర్రిలోని విద్యానగర్‌కు చెందిన మోతె బాపు(50) రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ వివరాల ప్రకారం... కూలీపని చేసుకునే మోతె బాపు కొంత కాలంగా తాగుడుకు బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు తాగుడు మానేయమని ఎంత చెప్పినా వినకుండా పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుధవారం మంచిర్యాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్లే గుర్తు తెలియని ట్రైన్‌కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కూతుర్లు ఉన్నారు.



బీఆర్‌ఎస్ ప్రచార రథం



బీజేపీ ప్రచార రథం



కాంగ్రెస్ ప్రచార రథం

ప్రచార రథాలు సిద్ధం..

అసెంబ్లీ ఎన్నికలకు నగరా మోగింది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజల్లోకి వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నాయి. బరిలో నిలిచే అభ్యర్థుల ప్రచారానికి ఉపయోగించే ప్రచార రథాలను సిద్ధం చేస్తున్నారు. అధికార బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ ప్రచార రథాలు సిద్ధంగా ఉన్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ప్రతీ వాహనం క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

సారంగపూర్: అంతర్రాష్ట్ర రహదారిపై రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సిర్పెల్లి గ్రామంలో మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వద్ద తనిఖీ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రం అయిన మహారాష్ట్ర నుంచి మద్యం, డబ్బు సరఫరా కాకుండా చూడాలన్నారు. వాహనాల్లో రాకపోకలు సాగించే పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసులు విధుల్లో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా అడ్డుకునే బాధ్యత సైతం పోలీసు సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట నిర్మల్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

నేరడిగొండ: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఉట్నూర్ డీఎస్పీ చుక్క నాగేందర్ గౌడ్ హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా బుధవారం నిర్మల్‌కు చెందిన ప్రహ్లాద్ రెడ్డి కారులో 171 బీరుబాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యంతో పాటు కారును స్వాధీనం చేసుకొ ని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అ క్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇ చ్చోడ సీఐ చంద్రశేఖర్, ఎస్సై సాయన్న, పోలీసులు భాస్కర్‌గౌడ్, శంకర్, దినేష్ పాల్గొన్నారు.

బెల్టు షాపులపై కొరడా

ఆదిలాబాద్‌టౌన్: గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తున్న వారిపై ఎక్సైజ్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆదిలాబాద్‌రూరల్ మండలంతో పాటు జిల్లా కేంద్రంలోనూ తనిఖీలు నిర్వహించారు. రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో పతి గంగమ్మ తన కిరాణ షాపులో మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 12 డౌన్ టౌన్ విస్కీ 180ఎంఎల్ బాటిళ్లను సీజ్ చేశారు. అదే విధంగా కచ్‌కంటి గ్రామంలో సర్గాని నర్సయ్య ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచడంతో దాడులు చేసి 16 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు సంజీవ్ కుమార్, నానక్‌సింగ్, శ్రీధర్, హన్మంతు, లత, సంధ్య తదితరులు ఉన్నారు.

మద్యం స్వాధీనం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని బెల్ట్‌షాప్‌పై పోలీసులు బుధవారం దాడిచేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని బెల్ట్‌షాప్‌పైన ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించి స్ట్రాంగ్ బీర్లు 89, కర్జూర లేగర్ బీర్స్ 26, కేఎఫ్ 17, విస్కీ 22, రాయల్ స్ట్రాంగ్ విస్కీ 15, రాయల్ చాలెంజ్ విస్కీ 13, ఓసీలు 17, గోల్డ్‌మార్కు విస్కీ 27, బడ్‌వైజర్ మాగ్నమ్ బీర్లు 24, ప్రీమియం బీర్లు 13 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

మద్యం పట్టివేత

భైంసాటౌన్: నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను తెలిపారు. మహాగాం గ్రామానికి చెందిన తాండ్ర గణేశ్, బగడ్వార్ సాయన్న భైంసా నుంచి ఆటోలో రూ.74,634 విలువైన మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పార్డి(బి) బైపాస్ రోడ్ వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు పూర్ణ, సందీప్, శ్రీకాంత్ ఉన్నారు.

గుడుంబా పట్టివేత

దస్తురాబాద్: మండలంలోని మున్యాలతండా గ్రామంలో 25లీటర్ల గుడుంబాను బుధవా రం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని మున్యాలతండాలో గుడుంబాను విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి అజ్మీరా రవి ఇంట్లో 25 లీటర్ల గు డుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాశవాణిలో గజ్జలమ్మదేవి భక్తి గీతాలు



భక్తిగీతాలు ఆలపిస్తున్న భజన బృందం

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి భక్తి గీతాలను ప్రముఖ కవి సత్యానంద గడ్డపు గజ్జారాం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఆకాశవాణిలో ఆలపించారు. మేలుకొలుపు, గజ్జలమ్మ వందనం, గల్లు గల్లున రావమ్మ కుంటాల గజ్జలమ్మ భక్తి గీతాలను జిల్కరి శ్రీనివాస్, అశోక్, రాములు, రాజన్న, చిన్నయ్య, గజ్జారాం ఆలపించిన భక్తిగీతాలను ఆకాశవాణిలో ప్రసారం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని జానపద కళలను, కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాల్లో ప్రోత్సహిస్తున్నామని ఆదిలాబాద్ ఆకాశవాణి ముఖ్య కార్యక్రమ అధికారి రామేశ్వర్ కేంద్రే తెలిపారు. ఆకాశవాణిలో వీటిని ప్రసారం చేసి భావితరాల కోసం పొందుపరిచి శ్రోతలను అలరింపజేస్తున్నామని ఆయన వెల్లడించాడు.

అరచేతిలో పంచాయతీ సమాచారం

- అందుబాటులోకి 'మేరీ పంచాయతీ' యాప్


నేరడిగొండ: గ్రామపంచాయతీ ఆదాయ, వ్యయాల విషయంలో పారదర్శకత పాటించేలా కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయతీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల వివరాలను పంచాయతీ కార్యాలయాలకు వెళ్లకుండానే యాప్ ద్వారా పరిశీలించవచ్చు. పంచాయతీలకు సంబంధించిన పద్దుల వివరాలు ప్రజల ముందుకు వచ్చాయి. ఈ యాప్‌ను 2019 లోనే రూపొందించగా కొన్ని కారణాలతో వివరాలన్నింటినీ నిక్షిప్తం చేయలేదు. గతేడాది నుంచి అన్నింటినీ ఇందులో పొందుపరుస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచారు.

ఎప్పటికప్పుడు వివరాలు అప్‌లోడ్..

గ్రామపంచాయతీకి సంబంధించిన నిధుల వివరాలే కాకుండా సర్పంచ్, కార్యదర్శి, గ్రామ కమిటీలు, ఆస్తుల సమాచారాన్ని సైతం యాప్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా మంజూరు చేసే నిధుల వివరాలతో పాటు ఏయే పనులకు ఎంత మొత్తం వెచ్చించారు. పనులు ఏ దశల్లో ఉన్నాయనే సమాచం యాప్‌లో దర్శనమిస్తుంది.

పారదర్శకతకు ప్రాధాన్యం..

పంచాయతీ నిధుల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నిక్షిప్తం చేయడంతో పాలనలో పారదర్శకత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.



'మేరీ పంచాయతీ' యాప్‌లో నమోదు చేసిన గ్రామపంచాయతీ సమాచారం

గ్రామాభివృద్ధికి ప్రభుత్వాలు ఎలాంటి పనులు చేపడుతున్నాయనేది ప్రజలు సులువుగా తెలుసుకోవచ్చు. గ్రామంలో చేపట్టే పనులను జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తిస్తుండడంతో ఒక్కసారి నిధులు మంజూరైన పనికి మరోసారి బడ్జెట్ కేటాయించడానికి వీలుండదు. పద్దుల వివరాలు ప్రజల వద్దకు వెళ్లడంతో పాలకవర్గాలు పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. ఒకవేళ తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రజలు ప్రశ్నించవచ్చు.

పంచాయతీ వివరాలు ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్‌లలో ప్లేస్టోర్‌కు వెళ్లి 'మేరీ పంచాయతీ' అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీన్ని తెరవగానే ఆర్థిక సంవత్సరం, రాష్ట్రం, జిల్లా, పంచాయతీ వివరాలు దర్శనమిస్తాయి. వాటిని నమోదు చేయగానే గ్రామపంచాయతీకి సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. గ్రామం పేరు లేదా పిన్‌కోడ్‌తో సైతం సంబంధిత పంచాయతీ వివరాలు తెలుసుకోవచ్చు.

జిల్లా	పంచాయతీలు
ఆదిలాబాద్	467
నిర్మల్	396
మంచిర్యాల	311
ఆసిఫాబాద్	335

సమాచారాన్ని సులువుగా తెలుసుకోవచ్చు



గ్రామపంచాయతీలకు సంబంధించిన వివరాలను నెలకోసారి ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా నిక్షిప్తపరుస్తారు. దీంతో ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నిధుల కేటాయింపు, పనుల వివరాల్లో సందేహాలు ఉంటే గ్రామసభల్లో ప్రశ్నించవచ్చు.

– అరుణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు